క్లుప్తంగా

విద్యా కానుక కిట్ల పరిశీలన



విద్యా కానుక కిట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యులు

కురబలకోట : రాష్ట్ర పాఠశాల విద్యా పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ సభ్యులు బి. ఈశ్వరయ్య గురువారం కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లు స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. యూనిఫాం, బూట్లు, సాక్స్, బెల్ట్, బ్యాగ్, నిఘంటువు, టెక్స్ట్ బుక్స్ నాణ్యత ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు. నాణ్యతగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ ద్వారకనాథ్ పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఏడీ రోహిణి బదిలీ



కురబలకోట: అంగళ్లు, బి.కొత్తకోట పశు సంవర్ధక శాఖ ఏడీ రోహిణి మదనపల్లెకు బదిలీ అయ్యారు. అక్కడున్న శ్రీధర్‌రెడ్డి అంగళ్లు ఏడీగా బదిలీ అయ్యారు. ఆయన గతంలో ఇక్కడ పశువైద్యాధికారిగా పని చేశారు.

ఊరటనిచ్చిన టమాట ధరలు



మార్కెట్‌కు వచ్చిన టమాట బాక్సులు

ములకలచెరువు: ఇన్నాళ్లు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన టమోట రైతులకు గత మూడు రోజుల నుంచి ఊరట లభిస్తోంది. ఈ నేపథ్యంలో ములకలచెరువు మార్కెట్‌లో 30 కిలోల టమోట బాక్సు ధర రూ.600 నుంచి రూ.700ల దాకా పలికింది.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలో గురువారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని హిందువులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ కూడలి హై స్కూల్ మీదుగా దిగువపేట వరకు హిందువులు ర్యాలీ నిర్వహించారు. హిందువుల ఐక్యత వర్ధిల్లాలి అంటు నినాదాలు చేశారు. కాషాయ జెండాలతో పురవీధుల్లో ఊరేగారు. హిందువుల ఐక్యత కోసం పూర్వీకులు ఎంతగానో కృషి చేశారని వారు తెలిపారు. వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు.

మిట్స్ విద్యార్థుల ప్రతిభ



బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

కురబలకోట : మదనపల్లె సమీపాన అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ సీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థులు నితీష్, పునీత్ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరచినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ గురువారం తెలిపారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సు ఆన్ డేటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-23 సదస్సులో ఈ విద్యార్థుల పరిశోధన జర్నల్‌కు అంతర్జాతీయ స్థాయిలో బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.

సింహ వాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు

పెనగలూరు : పెనగలూరు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి వేణుగోపాలస్వామి సింహవాహనంపై ఊరేగాడు. పంచేటి వారు ఉభయదాతలుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 9 గంటలకు హరికథ కాలక్షేపం జరిగింది. అనంతరం వేణుగోపాలస్వామిని పురవీధులలో ఊరేగించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం హనుమంతు సేవ (రెడ్డిసంఘం) జరుగనుందని ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి తెలిపారు.

స్థలాలను పరిశీలించిన ఆర్డీఓ

రైల్వేకోడూరు : మండలంలోని జిల్లా సరిహద్దు గ్రామాలైన బాలపల్లె, కుక్కలదొడ్డి గ్రామాలకు సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కోసం కేటాయిస్తున్న 5 ఎకరాల స్థలాన్ని గురువారం రాజంపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓ భాస్కర్ పరిశీలించారు. అలాగే పట్టణంలో ఎస్‌ఈబీ డిపార్ట్‌మెంట్ వారికి నూతన భవనం కోసం కె.బుడుగుంటపల్లెకు పోయే దారిలో స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు రామ్మోహన్, ఆర్ఐ రాజశేఖర్, సర్వేయర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల్లో ఆనందం నింపడమే లక్ష్యం

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : పేద ప్రజల కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే మండలంలోని వగళ్ల పంచాయతీ నారమాకులవడ్డిపల్లె, నారమాకులపల్లె, కొత్తపల్లె, మారంరెడ్డిగారిపల్లెలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, ఆర్థికంగా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నాలుగేళ్ల పాలన దిగ్విజయంగా జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వానికి ఎంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఇచ్చిన హామీలే కాకుండా ఎన్నో కొత్త పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం నారమాకులవడ్డిపల్లెలో పలు వీధుల్లో రోడ్డు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే విద్యుత్ లైన్ల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కొన్ని ఇళ్లకు తాగునీరు అందడం లేదని, పైపులైన్లు సరి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మౌలిక సదుపాయాలు తక్షణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి ఇళ్లు, పింఛన్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ చౌకదుకాణం ద్వారా సక్రమంగా సరుకులు అందించాలని స్థానికులు కోరడంతో సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, సర్పంచ్ రెడ్డికాంతమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి, నెడ్‌క్యాప్, హౌసింగ్, ఏపీఐఐసీ, ఉర్దూ అకాడమీ డైరెక్టర్లు సుగుణమ్మ, భాస్కర్‌నాయుడు, ప్రదీప్‌రెడ్డి, కలీమ్, నాయకులు రామకొండారెడ్డి, వెంకటసిద్దులు, ఖాదర్‌బాషా, రఘునాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, తాతయ్య, రెడ్డిమునెయ్య, శ్రీనివాసులు, సి.కె.యర్రమరెడ్డి, సైపుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జంగమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో జంగం సేవా సంఘం సభ్యులు

కలికిరి: పరమేశ్వర జంగం సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన జంగమ కులానికి చెందిన విద్యార్థిని, విద్యార్థులకు గురువారం ప్రోత్సాహకాలు అందజేశారు. మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, 3 వేలు, రూ.2 వేలు, 450 మార్కులు సాధించిన వారికి రూ.వెయ్యి వంతున నగదు, ఆంగ్ల డిక్షనరీలు, మెమెంటోలు అందజేసి, భవిష్యత్తులో మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చాముండేశ్వరయ్య, గౌరవాధ్యక్షుడు రమణయ్య, అధ్యక్షుడు ఎర్రమరాజయ్య, కార్యదర్శి వెంకటపతి, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, సభ్యులు హరినాథ్, మల్లయ్య, రెడ్డిరాజు, బాల వెంకటరమణ, విజయ్, శేఖర్, గంగాధర్, వీరభద్రయ్య, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొదటి రోజే 90 శాతం పింఛన్లు



కోన పంచాయతీలో ఒకే ఇంటి వద్ద బియ్యం, పింఛన్ అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్, వలంటీర్

కలకడ : మండలంలోని 16 పంచాయతీలలో 1వ తేది మొదటి రోజునే 90 శాతం మందికి పింఛన్లు, 20 శాతం మందికి బియ్యం ఇంటి వద్దకే చేర్చినట్లు తహసీల్దార్ రాము, ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి వలంటీర్‌లు పింఛన్ను, ఎండియూ ఆపరేటర్లు వాహనాల ద్వారా బియ్యం ఇంటింటికీ అందజేశారు. బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని పౌర సరఫరాల సంస్థ డీటీ వెంకటరెడ్డి, కోన వీఆర్ఓ రవిచంద్రన్ కోన పంచాయతీలో జరుగుతున్న బియ్యం పంపిణీ వాహనాన్ని తనిఖీ చేశారు.

దళితుల సమస్యల పరిష్కారంపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలత

కలికిరి : దళితుల సమస్యల గుర్తింపునకు ప్రతి నెలా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు భాగ్యలత అన్నారు. గురువారం కలికిరి పట్టణ పరిధిలోని బండకాడపల్లి రామాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకపోయినా, వివక్షకు గురైనా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎండీయూ ఆపరేటర్ చౌకబియ్యం సకాలంలో ఇవ్వడం లేదని, ఒక్కొక్కసారి అసలు ఇవ్వడం లేదని స్థానికులు తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. వచ్చే నెల నుంచి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆజాద్, మండల వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప, ఏఎస్ఐ మధుసూదనాచారి, వీఆర్ఓలు విశ్వనాథ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయానికి విరాళం



ఈఓకు నగదు అందజేస్తున్న గణేష్, శిరీష

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయానికి శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన భక్తులు గణేష్, శిరీష దంపతులు రూ. లక్ష విరాళంగా అందజేశారు. గురువారం స్థానిక ఆలయానికి చేరుకొన్న దాతలకు ఆలయ ఈవో మంజుల ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు రూ.లక్షను ఆలయ ఈవోకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. దాతలు ఇచ్చిన నగదును వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి



గ్రామస్తులకు సలహాలు, సూచనలు చేస్తున్న ఏఎస్ఐ నరసింహులు

గుర్రంకొండ : నడిమికండ్రిగ గ్రామంలో ఈ నెల 3 తేదీన నిర్వహించబోయే శ్రీ పోలేరమ్మ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏఎస్ఐ నరసింహులు అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో చాందినీ బండ్లు కట్టే వారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులు, నిర్వాహకులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమణ, సిబ్బంది విజయ్, రాఘవ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై పర్యాటకుల సందడి



గాలిబండపై నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న సందర్శకులు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యాటకులు సందడి చేస్తున్నారు. సెలవులు కావడంతో కొండకు వస్తున్న పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. గురువారం భారీసంఖ్యలో సందర్శకులు కొండపైకి వచ్చారు. గాలిబండ, అటవీసముదాయం, వ్యూపాయింట్ల నుంచి ప్రకృతి అందాలను తిలకించారు. అటవీసముదాయంలో కలెక్టర్ డబ్ల్యూ.డీ.హార్సిలీ నిర్మించిన తొలి అతిథిగృహాన్ని, ఆయన నాటిన మహా నీలగిరి వృక్షాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించగా అటవీసిబ్బంది బద్రినాథ్ వాటి గురించిన వివరాలు తెలిపారు. గాలిబండపై ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు.

రేపు కోదండరామస్వామి తిరునాల

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ సిద్దమ్మగారిపల్లెలో వెలసిన శ్రీ కోదండరామస్వామి తిరునాల శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జి.కె.వెంకటరమణ, శేఖర్ తెలిపారు. ఈ నెల తిరునాల రెండు రోజుల పాటు జరుగుతుందని వారు పేర్కొన్నారు. అన్నదానం, స్వామి కల్యాణం కనుల పండువగా జరుగుతుందన్నారు. భక్తులు స్వామిని దర్శించుకోవాలన్నారు.

6న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ భూమకవారిపల్లెలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి 8 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 6న విశ్వక్సేన ఆరాధన, అంకుర్పారణ జరుగుతుందన్నారు. 7న మూలమూర్తులకు అభిషేకం, పూజలు జరుగుతాయన్నారు. 8న ఉదయం హోమాలు, సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

రేపటి నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

కలికిరి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో శనివారం నుంచి వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారిణి మమతారెడ్డి తెలిపారు. 11 ఆర్బీకే కేంద్రాల్లో నారాయణ రకం విత్తనకాయలు 1251 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, 30 కిలోల బస్తాకు రూ.1773 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కాయలు కావాల్సిన రైతులు ఆధార్, మొబైల్ వెంట తెచ్చుకోవాలని ఆమె సూచించారు.

పంపిణీకి సిద్ధంగా విత్తన కాయలు

ములకలచెరువు : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వ రాయితీ ద్వారా అందజేసే వేరుశనగ విత్తన కాయలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏవో లీలాకుమారి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలానికి మొదటి విడతగా మంజూరైన 2,400 క్వింటాళ్ల విత్తన కాయలను ఆయా గ్రామాల ఆర్బీకేలలో నిల్వ ఉంచామన్నారు. 30 కిలోల బస్తా కాయలను రూ.1,674ల చొప్పున అందజేస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే కాయలను పంపిణీ చేస్తామన్నారు.

పెరిగిన భూముల విలువ

కలికిరి : కలికిరి సబ్ రిజిస్ట్రారు కార్యాలయ పరిధిలోని కలికిరి, కె.రెడ్డివారిపల్లి, కందూరు, తాటిగుంటపల్లి, గండబోయనపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో వ్యవసాయ భూముల విలువ పెరిగినట్లు సబ్ రిజిస్ట్రారు సత్యప్రసాద్ తెలిపారు. కలికిరి రెవెన్యూ గ్రామ పరిధిలో గతంలో కంటే 40 శాతం, మిగిలిన గ్రామాల్లో 30 శాతం ధరలు పెరిగాయని, జాగాల విలువలు సైతం 40 శాతం, ఇంటి విలువలోనూ 40 శాతం ధరలు పెరిగనట్లు ఆయన పేర్కొన్నారు. పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయన్నారు.

అవధూత నారాయణస్వామి ఆరాధనోత్సవాలు

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో వెలసిన అవధూత నారాయణస్వామి 74వ ఆరాధనోత్సవాలను ఆదివారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సీతారాంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల కోరికలను నెరవేర్చిన అవధూత నారాయణ స్వామి సుమారు 74వ వార్షికోత్సవాన్ని ఆదివారం 4వ తేదీన 6.30గంటలకు ఓబుల్‌రెడ్డిగారిపల్లెలోని ఆయన మందిరంలో జరుపనున్నామని పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతి, 12.40నిమిషాలకు అభిషేకం, 1.20 నిమిషాలకు మహా మంగళ హారతి, తీర్థప్రసాదం తదుపరి అన్నదానం, సత్యసాయి జిల్లా కదిరి వాస్తవ్యులచే రాత్రి 9గంటలకు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర కళా బృందంచే సానవుల చిన్నమ్మ కథను నాట్య రూపంలో ప్రదర్శించబడుతుందన్నారు. అలాగే బండలాగుడు పోటీలు నిర్వహించి మొదటి బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.11వేలు , నాలుగవ బహుమతి రూ.9వేలు, 5వ బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్సవ మండపానికి శంకుస్థాపన

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం ఉత్సవ మండప నిర్మాణానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. మండప నిర్మాణం పూర్తయ్యాక అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గునిశెట్టి రమేష్, చర్లపాటి హరినాథ్, కామిశెట్టి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపురమ్మకు ప్రత్యేక పూజలు

సంబేపల్లె : దుద్యాల పంచాయతీలో వెలసిన కొత్తపురమ్మకు గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో అమ్మవారి ఆలయాల్ని శుద్ధి చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు.

క్షయరోగులు పౌష్టికాహారం తీసుకోవాలి



టీబీ రోగులకు పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి

మదనపల్లె : క్షయవ్యాధిగ్రస్తులు మందులతోపాటు సమతుల్యతతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే టీబీ వ్యాధి తొందరగా నయమవుతుందని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి అన్నారు. గురువారం జిల్లా ఆస్పత్రిలో టీబీ రోగులకు వారి సమ్మతితో మదనపల్లె వాసవీక్లబ్, ఇతర దాతల సహకారంతో పౌష్టిక ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మాంజలిదేవి మాట్లాడుతూ సమాజంలో క్షయవ్యాధిగ్రస్తులకు ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ నిక్షయ్-మిత్ర పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. జిల్లాలో టీబీ వ్యాధికి చికిత్స పొందుతున్న వారికి బలవర్ధకమైన ఆహారాన్ని అందించేందుకు క్షయమిత్రగా దత్తత తీసుకునేందుకు ప్రజలు, పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 40 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు వాసవీక్లబ్ మెంబర్‌లు డీఎం.అభినయకాంత్, జీఎస్.అరుణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, పి.అమరనాథ్, చంద్రశేఖర్, పి.అశ్వర్థనారాయణ, మునిరాజ, ఫణికుమార్, వెంకటేష్‌బాబు, సంతోష్ కుమార్, శివప్రసాద్, రమేష్‌బాబు, విజయకుమార్‌లు ఒక్కో పేషెంట్‌ను ఆరునెలల పాటు, ఇతర దాతలు జవహర్‌హుస్సేన్, వెంకటేష్, మహమ్మద్‌అలీ, చంద్రబాబు, దేవిప్రియ, మధుకర్‌రెడ్డిలు ఇద్దరు పేషెంట్లను ఆరునెలల పాటు దత్తత తీసుకుని పౌష్టికాహారం అందించారన్నారు. టీబీ పేషెంట్లను దత్తత తీసుకోవాలనే దాతలు ముందుగా నిక్షయ మిత్ర ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా ఆస్పత్రిలోని టీబీ యూనిట్ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది దయాలన్, సిబ్బాలప్రభాకర్, సుశీల, వనజకుమారి, తరుణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా.. చల్లగ చూడమ్మా..



కుండలతో జలాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళా భక్తులు

వాల్మీకిపురం : 'గంగమ్మా.. చల్లగ చూడమ్మా' అని భక్తులు వేడుకున్నారు. వాల్మీకిపురం గ్రామ దేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతరలో భాగంగా గురువారం పట్టణంలోని కోనేటివీధి, నాయక్‌వీధిలోని గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంధాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన సేవలు నిర్వహించారు. పోతురాజు విగ్రహానికి పూజలు నిర్వహించి, జాతర చాటింపు వేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహిళలు దీలు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ చైర్మన్ మొర్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి, కేశవ రెడ్డి, బలరాం, విజయవర్మ, రవి, రఘు, ఆనంద శెట్టి, మహేష్, శివ, పులిబ్రదర్స్, పూజారి జనార్ధన్, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శివలింగం, నందీశ్వరుడికి అభిషేకం



శివలింగం, నందీశ్వరునికి ఏకకాలంలో పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో గురువారం జరిగిన ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో త్రయోదశి సందర్భంగా సాయంత్రం శివలింగం, నందీశ్వరునికి ఏకకాలంలో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, మహా మంగళ హారతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇలాంటి అభిషేకాలు అరుదుగా నిర్వహిస్తారని, తద్వారా ప్రజల సమస్త దోషాలు తొలగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిలే నిరాహార దీక్షలో వివిధ సంఘాల నాయకులు

పీలేరు రూరల్ : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలకు చట్టబద్ధత చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను సత్వరం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు అందించాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి గురుప్రసాద్, పీహెచ్, ఎంఈయూ అధ్యక్షుడు ఎ. లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం పీలేరు తాలూకా అధ్యక్షులు పురుషోత్తం, కార్యదర్శి రాజశేఖర్, వివిధ సంఘాల నాయకులు శివయ్య, కుసుమ, శ్రీనివాసమూర్తి, చంద్రారెడ్డి, రాధాకృష్ణ, రాజ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జాహ్నవి

ములకలచెరువు : అడవి నాయునిచెరువుపల్లిలో పీహెచ్‌సీ డాక్టర్ జాహ్నవి సిబ్బందితో కలసి గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరంలో సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, ఏఎంఎం శైలజ, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.